7

సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 5 । డిసెంబర్ । 2023

- తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- భారీగా వీస్తున్న ఈదురుగాలులు
- ఆందోళన చెందుతున్న రైతులు
- అవస్థలు పడుతున్న జనం



పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో ఇంటికి వెళుతున్న మఠం పంచాయతీలోని విద్యార్థులు

మఠం గ్రామ సమీపంలోని టార్పాలిన్లు కప్పిన వరి కుప్పలు



గాలివాన.. మన్యం గజగజ

సాక్షి,పాడేరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా సోమవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి గంటకు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. పాడేరులో ఈదురు గాలుల ప్రభావం అధికంగా ఉండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భీతిల్లారు. వర్షానికి తోడు చలిగాలులు వీస్తుండడంతో జిల్లా వాసులు అవస్థలకు గురవుతున్నారు. సోమ, మంగళవారాలు అన్ని స్కూళ్లకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సెలవు ప్రకటించడంతో సోమవారం మధ్యాహ్నం భోజనం అనంతరం విద్యార్థులు పాఠశాలల నుంచి సురక్షితంగా ఇళ్లకు వెళ్లిపోయారు. అనంతగిరి, పాడేరు, లంబసింగి, కొక్కిరాపల్లి, సీలేరు, రంపుల ఘాట్‌రోడ్డు ప్రాంతాల్లో పొగమంచుతో పాటు వర్షం కురవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.

పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. చలిగాలులు, వర్షం కారణంగా చాలా గ్రామాల్లోని ప్రజలుఇళ్లకే పరిమితమయ్యారు.

అన్నదాతల్లో ఆందోళన

జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లో వరితో పాటు చిరుధాన్యాల సాగు ఆశాజనకంగా ఉంది. కోతకోసిన వరిపంటను రక్షించుకునే ప్రయత్నాల్లో రైతులు నిమగ్నమయ్యారు. కోసిన వరి పనలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కుప్పలు పెట్టి ప్లాస్టిక్ కవర్లు, టార్పాలిన్లను కప్పి రక్షణ చర్యలు చేపట్టారు. రాజ్‌మా, వలిసెల పంటలు మాత్రం తడిసిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వర్షపాతం వివరాలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం మధ్యాహ్నం నాటికి 55.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అనంతగిరిలో 9.6 మిల్లీమీటర్లు, దేవీపట్నంలో 5.2, రాజవొమ్మంగిలో 4.6, అడ్డతీగలలో 3.8, పాడేరులో 3.4, అరకులోయలో 3.4, రంపచోడవరంలో 3.2, జి.మాడుగులలో 2.8, హుకుంపేటలో 2.8, గంగవరంలో 2.6, కొయ్యూరులో 2.4, చింతపల్లిలో 2.2, జీకే వీధిలో 2, డుంబ్రిగుడలో 1.8, వై.రామవరంలో 1.8, మారేడుమిల్లిలో 1.4, పెదబయలులో 1.4, ముంచంగిపుట్టులో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నేడు, రేపు వర్షాలు

తుపాను ప్రభావంతో సోమవారం వేకువజాము నుంచి జిల్లాతో పాటు విశాఖ నగరం అనకాపల్లి జిల్లాలోనూ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. మధ్యమధ్యలో కాస్త విరామం ఇస్తూ వానలు కొనసాగుతున్నాయి. వర్షాలతో పాటు ఈదురు గాలులు బలంగా వీస్తున్నాయి. చలితో కూడిన ఈ గాలులు జనాన్ని ఒకింత వణికిస్తున్నాయి. తుపాను మంగళవారం మధ్యాహ్నానికి బాపట్లకు సమీపంలో తీరాన్ని దాటనుంది. ఆ ప్రభావంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో మంగళ,బుధవారం వర్షాలు, గాలుల ఉధృతి పెరగనుంది.

300 టన్నుల ధాన్యం కొనుగోలు



ధాన్యం కొనుగోలు చేస్తున్న అధికారులు



ధాన్యాన్ని తరలించేందుకు సిద్ధం చేసిన సిబ్బంది

తేమ,రంగుతో సంబంధం లేకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో పౌరసరఫరాలశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. నూర్పులు పూర్తిచేసిన దేవీపట్నం, గంగవరం ప్రాంతాల్లో ఆది,సోమవారాల్లో 300 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు జిల్లా పౌరసరఫరాలశాఖ డీఎం గణేష్ సాక్షికి తెలిపారు. తుపాను కారణంగా రైతులు నష్టపోకూడ దని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

న్యూస్‌రీల్

ఐటీడీఏ స్పందనకు 19 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌లు నిర్వహించిన స్పందనకు 19 అర్జీలు వచ్చాయి. తుపాను కారణంగా స్పందనకు వచ్చే వారి సంఖ్య తగ్గింది. భూ సమస్యను పరిష్కారించాలని దేవీపట్నం మండలం గిన్నెపల్లి తాటివాడకు చెందిన ప్రసాద్ దొర అర్జీ అందజేశారు. చింతూరు గ్రామంలోని సంతమార్కెట్ వేలం పాటను రూ.5.90 లక్షలకు దక్కించుకున్నామని, ఆదర్శ గ్రామ సంఘం, బాబా పొదుపుసంఘం సభ్యులు చోడి సత్యవతి, బాపనమ్మ, తుర్రం కాంతమ్మలు తెలిపారు. అంత నగదు వసూలు కావడం లేదని, పాట సొమ్మును తగ్గించాలని కోరుతూ అర్జీ అందజేశారు. వీరితో పాటు పలువురు వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు అందజేశారు. స్పందనలో ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ

రంపచోడవరం: గిరిజన యువతకు హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్టు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ పూర్తి చేసిన గిరిజనయువత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. మూడు నెలలపాటు శిక్షణ పొందేందుకు 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులు. దరఖాస్తు చేసిన వారిలో 15 మందిని ఎంపిక చేసి, తిరుపతిలో శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులుఈనెల 7తేదీలోగా రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 83338 68772 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పీవో చెప్పారు.

తుపానును సమర్థంగా ఎదుర్కోవాలి

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్,ఎస్పీ

సాక్షి,పాడేరు: హుద్‌హుద్ లాంటి పెద్ద తుపానును ఎదుర్కొన్న అనుభవం అధికారులకు ఉందని, మిచాంగ్ తుపానును కూడా సమర్థంగా ఎదుర్కొని ఎటువంటి ప్రాణనష్టం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. తుపానును ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన చర్యలపై తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి సీఎం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వంచారు. కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుహిన్‌సిన్హా, జేసీ శివశ్రీనివాస్, పలువురు అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని 22 మండలాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సీఎం ఆదేశాలిచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలను ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఖరీఫ్ పంటను కాపాడాలని, పశువుల ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని, తేమ, రంగు వంటి అంశాలను పట్టించుకోకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తుపాను సహాయక చర్యల్లో సచివాలయ ఉద్యోగుల సేవలు సద్వినియోగం చేసుకోవాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో అంబేడ్కర్, జిల్లా వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు నందు, రమేష్‌కుమార్‌రావు, పౌరసరఫరాలశాఖ డీఎం గణేష్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌సిన్హా,జేసీ శివశ్రీనివాస్

మిచాంగ్‌పై అప్రమత్తం

కలెక్టర్ సుమిత్ కుమార్



సాక్షి,పాడేరు: తుపాను తీవ్రత కారణంగా సెలవులు పెట్టకుండా రానున్న 24గంటల పాటు జిల్లాలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయం నుంచి రెవెన్యూ, పోలీసు, మండల పరిషత్, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా ప్రజలతో పాటు పశువులకు ప్రాణనష్టం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఘాట్‌రోడ్డు ప్రాంతాలతో పాటు ఇతర మార్గాల్లో రవాణా వ్యవస్థకు ఇబ్బందులు లేకుండా ఆర్‌అండ్‌బీ, పోలీసుశాఖ, తహసీల్దార్‌లు అప్రమత్తంగా ఉండాలన్నారు. జేసీబీలు,కట్టర్‌లు అందుబాటులో ఉంచుకోవాలని, చెట్లు కూలితే వెంటనే తొలగించాలన్నారు. అరకు, పాడేరు,అనంతగిరి మండలాల్లో ఘాట్‌రోడ్లలో వాహనాలు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలు లేకుండా ట్రాన్స్‌కో అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. వరి కోతలు కోయకుండా వ్యవసాయ, ఉద్యానవనశాఖలు మండల, గ్రామస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేయాలని తెలిపారు. దేవీపట్నం, చింతూరు ప్రాంతాలలోని వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండి సహాయక కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు అభిషేక్, సూరజ్‌గనోరే, పలుశాఖల అధికారులు,ఎంపీడీవోలు,తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో మేలు

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



హుకుంపేటలో మాట్లాడుతున్న చెట్టి పాల్గుణ

హుకుంపేట/అరకులోయరూరల్/డుంబ్రిగుడ: సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ప్రజలకు ఎంతోమేలు జరుగుతోందని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు అందించే విషయంలో నిర్లక్ష్యం చేయకుండా సచివాలయ సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. సోమవారం హుకుంపేట, అరకులోయ, డుంబ్రిగుడలలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో హుకుంపేట ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం, ఎంపీడీవో వెంకటరావు, ఈవోపీఆర్డీ అప్పలరాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, ఏపీఎం చిన్నారావు, డుంబ్రిగుడ ఎంపీడీవో ఉషారాణి, ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ చట్టారి జానకమ్మ, అరకులోయ ఎంపీడీవో వెంకటేష్, పంచాయతీ ఈవో రాజ్‌కుమా, వెలుగు ఏపీఎం అప్పయమ్మ పాల్గొన్నారు.

జర్నీకి తుపాను బ్రేక్!

- ఇప్పటికే 80కి పైగా రైళ్ల రద్దు
- తాజాగా ఆరు విమాన సర్వీసులూ క్యాన్సిల్
- బస్సుల రద్దుపై వేచిచూస్తున్న ఆర్టీసీ అధికారులు

సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను ప్రభావం ప్రయాణికులపై పడింది. వివిధ ప్రాంతాలకు వెళ్లే వారి ప్రయాణాలకు బ్రేకులు వేసింది. చెన్నై నుంచి విశాఖపట్నం వరకు తుపాను ప్రభావం ఉంది. దీని ధాటికి భారీ నుంచి అతి భారీ వర్షాలు, అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రధానంగా తమిళనాడుతో పాటు తిరుపతి, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో కుంభవృష్టి కురుస్తోంది. మరో రెండ్రోజులు భారీ వర్షాలు కొనసాగనున్నాయి. ఫలితంగా రైల్వే ట్రాక్‌లు వరద నీటిలో చిక్కుకోవడం గాని, కొట్టుకుపోవడం గాని జరిగే అవకాశాలున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్త చర్యగా రైల్వే శాఖ తమిళనాడు నుంచి విశాఖపట్నం వైపు వచ్చే, విశాఖ మీదుగా విజయవాడ, తమిళనాడు వైపు వెళ్లే దాదాపు 80కి పైగా ఎక్స్‌ప్రెస్, పాసింజరు రైళ్లను ఇప్పటికే రద్దు చేసింది. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే వారు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలను రద్దు చేసుకోవలసి వచ్చింది. మళ్లీ ఏడో తేదీ నుంచి రద్దయిన రైళ్లను దశల వారీగా పునరుద్ధరించనున్నారు. మరోవైపు ప్రతికూల వాతావరణంతో విమాన సర్వీసులు కూడా క్యాన్సిల్ అయ్యాయి. సోమవారం విశాఖపట్నం-చెన్నై, విశాఖపట్నం-హైదరాబాద్, విశాఖపట్నం-విజయవాడ, విశాఖపట్నం-తిరుపతి, చెన్నై- విశాఖపట్నం, హైదరాబాద్-విశాఖపట్నంల మధ్య నడిచే విమానాలను రద్దు చేశారు. మంగళవారం కూడా తుపాను తీవ్రత కొనసాగనుంది. అందువల్ల విశాఖపట్నం విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే కొన్ని విమాన సర్వీసులు రద్దు కానున్నాయి.

వేచి చూస్తున్న ఆర్టీసీ

సాధారణంగా రైళ్ల రద్దయినప్పుడు ఆ ప్రభావం బస్సులపై పడుతుంది. కానీ ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. రైళ్లకు బదులు బస్సుల్లో దూరప్రాంతాలకు వెళ్లడానికి జనం ఆసక్తి చూపించడం లేదు. తుపాను తీవ్రత తగ్గాకే వెళ్లవచ్చన్న భావనతో వీరు తమ ప్రయాణాలను తాత్కాలికంగా రద్దు చేసుకున్నారు. మరోవైపు తీవ్ర తుపాను కొనసాగుతున్నా ఆర్టీసీ అధికారులు తమ దూరప్రాంత సర్వీసులను సోమవారం రాత్రి వరకు నడిపారు. ప్రధానంగా తుపాను ప్రభావం రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రపై చూపుతోంది. విశాఖ నుంచి కడప, తిరుపతి, ప్రొద్దుటూరు, కర్నూలుతోపాటు విజయవాడ, గుంటూరు, భీమవరం తదితర ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్నాయి. మంగళవారం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏఏ సర్వీసులను ఎక్కడ వరకు నడపాలన్న దానిపై నిర్ణయం తీసుకోనున్నట్టు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

అత్యవసర సేవలకు నిరంతర విద్యుత్

- తుపాన్ షెల్టర్స్, హాస్పిటల్స్‌కు అంతరాయం కలగకూడదు
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆదేశం
- 5 సర్కిళ్లలో కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు



సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల కలిగే విద్యుత్ ప్రమాదాలు, అంతరాయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు సంస్థ డైరెక్టర్లు, 5 సర్కిళ్ల అధికారులకు అవసరమైన సూచనల్ని సీఎండీ చేశారు. ప్రమాదాలు, అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912కి తెలియచేయాలన్నారు. తుపాను సహాయక కేంద్రాలకు, హాస్పిటల్స్‌కు తప్పనిసరిగా విద్యుత్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్ల ఎస్ఈలను ఆదేశించారు. తుపాను ప్రభావానికి తెగిపడే విద్యుత్ వైర్లను, విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను అందుబాటులో ఉంచాలని ఎస్ఈల్ని ఆదేశించారు. డైరెక్టర్ ఆపరేషన్స్ బి.రమేష్ ప్రసాద్ రాజమండ్రి సర్కిల్‌లోనూ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ఏవీవీ సూర్యప్రతాప్ ఏలూరు సర్కిల్‌లో పునరుద్ధరణ చర్యల ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. వినియోగదారుల నుంచి వచ్చే విద్యుత్ అంతరాయాల ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేసుకునేందుకు ఐదు జిల్లాల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు సీఎండీ తెలిపారు. సమాచారాన్ని టోల్ ఫ్రీ నెం. 1912, వాట్సాప్ నెంబర్ 8500001912, కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లకు తెలియజేయాలని సూచించారు.

కంట్రోల్ రూమ్ నంబర్లు

టోల్ ఫ్రీ నంబర్	1912
కార్పొరేట్ కార్యాలయం	9440816373
శ్రీకాకుళం	9490612633
విజయనగరం	9490610102
విశాఖపట్నం	7382299975
రాజమండ్రి	7382299960
ఏలూరు	9440902926

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం(విశాఖ) : మిచాంగ్ తుపాను కారణంగా విశాఖపట్నం మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు ఆయా తేదీలలో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈ నెల 5వ తేదీన తిరుపతి-బిలాస్‌పూర్(17480) ఎక్స్‌ప్రెస్, తిరుపతి-విశాఖపట్నం(08584) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తిరుచునాపల్లి - హౌరా ఎక్స్‌ప్రెస్, కేఎస్ఆర్ బెంగళూరు-న్యూటిన్‌సుకియా జంక్షన్ (22501) ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు- అగర్తలా (12503) ఎక్స్‌ప్రెస్‌లు రద్దయ్యాయి. 6వ తేదీన పూరీ-తిరుపతి (17479) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

నేడు ఏయూకు సెలవు

ఏయూక్యాంపస్: తుపాను నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి మంగళవారం సెలవు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల విధులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

• వాన స్నోయగం



చింతపల్లి మండలం లంబసింగిలో ఏకకాలంలో కురుస్తున్న పొగమంచు, వర్షం



అనంతగిరిలో సోమవారం ఉదయం దట్టంగా కమ్ముకున్న పొగమంచు

సాక్షి,పాడేరు/ అనంతగిరి : మంచుకురిసే వేళలో ప్రకృతి అందాలు ద్విగిణీకృతమవుతాయి. మంచుతో పాటు వెండిపూలు రాలుతున్నట్టు వాన కురిస్తే... ఆహా ఆ అద్భుతం వర్ణణాతీం. ఆంధ్రా కశ్మీర్‌గా పేరొందిన అతిశీతల ప్రాంతం లంబసింగిలో ఇటువంటి ఆహ్లాదకర వాతావరణం పర్యాటకులు, స్థానికులను కనువిందు చేసింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో పాటు వర్షం కురుస్తున్న దృశ్యాలు లంబసింగి ప్రాంతానికి సరికొత్త అందాలను అద్దాయి. లంబసింగి సమీప ప్రాంతమంతా ఇదే వాతావరణం నెలకొంది.

అనంతగిరి మండలంలో అరకు-విశాఖ ప్రధాన రహదారిలోని ఉదయం కొంతసేపు దట్టంగా పొగమంచుకమ్ముకోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని, ప్రయాణాలు సాగించారు.

ఇంటర్ విద్యార్థులకు బంపర్ ఆఫర్

- ప్రతిభ చూపిన వారికి ఐటీ కొలువు
- ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు
- అండగా నిలుస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందేలా తోడ్పాటు
- కాలేజీలకే రానున్న సాఫ్ట్‌వేర్ కంపెనీలు
- ఈ నెల 20న హెచ్‌సీఎల్ టెక్-బీ పరీక్ష



విశాఖలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థినులు

విశాఖ విద్య: ఇంటర్‌తోనే ఐటీ కొలువులు దక్కించుకోవచ్చు. ఉద్యోగం చేస్తూనే పేరొందిన యూనివర్సిటీల్లో డిగ్రీ, ఆ పైకోర్సులను చదువుకోవచ్చు. హెచ్‌సీఎల్ టెక్-బీ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఇలాంటి అరుదైన అవకాశం లభించనుంది. ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలతో సాఫ్ట్‌వేర్ కంపెనీలు కాలేజీలకే వచ్చి నైపుణ్యం గల విద్యార్థులను ఎంపిక చేసుకొని వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి, ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయి. ఇప్పటివరకు డిగ్రీ, పీజీ కోర్సులు చేసిన వారికే ఇలాంటి అవకాశం దక్కుతుండగా, తాజాగా ఇంటర్ విద్యార్థులకు సైతం చక్కటి అవకాశం లభించనుంది.

16లోగా దరఖాస్తు చేసుకోవాలి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు. https://bit.ly/TechbeeGoAP వెబ్‌సైట్‌లో విద్యార్థుల పూర్తి వివరాలను నమోదు చేసి ఈ నెల 16లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్థులు మూడు దశల్లో పరీక్షలు రాయాలి. తొలుత రాత పరీక్ష, ఆ తరువాత ఇంగ్లిష్ నైపుణ్య పరీక్ష నిర్వహిస్తారు. ఈ రెండింటిలో ప్రతిభ చూపిన వారిని ఇంటర్వ్యూకు పిలుస్తారు. దీనిలో అర్హత సాధించిన వారికి ఏడాది పాటు శిక్షణ ఉంటుంది. శిక్షణ కాలంలో ఏడో నెల నుంచి నెలకు రూ.10 వేలు చొప్పున స్టైఫండ్ ఇస్తారు. అనంతరం మంచి వేతనంతో కూడిన ఉద్యోగం దక్కనుంది.


ఫోన్లలో పరీక్ష రాసే అవకాశం

విశాఖ జిల్లాకు చెందిన విద్యార్థులకు ఈ నెల 20న, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 22న పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.30గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఆన్‌లైన్ క్యాట్ టెస్టు పేరిట నిర్వహించే ఈ పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో చదివే విద్యార్థులంతా అర్హులే. ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్న ఈ పరీక్షకు విద్యార్థులు తమ సొంత సెల్‌ఫోన్లు కూడా ఉపయోగించుకోవచ్చు.

ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు

ఇంటర్ బోర్డుతో హెచ్‌సీఎల్ టెక్-బీ సాఫ్ట్‌వేర్ కంపెనీ చేసుకున్న ఒప్పందం మేరకు విద్యార్థులకు ఇటువంటి అరుదైన అవకాశం లభించనుంది. ఇంటర్‌లో ఎంపీసీ, ఎంఈసీ గ్రూపు విద్యార్థులకు ఐటీ రంగంలోనూ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులు చదివిన వారికి అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి డీపీవో విభాగంలో ఉద్యోగాలు కల్పించనున్నారు. ఎంపికైన విద్యార్థులు ఉద్యోగం చేసుకుంటూనే డిగ్రీ, ఆ పైస్థాయి కోర్సులను చదువుకోవచ్చు. కోర్సు ఫీజులో ఏడాదికి రూ.15 వేలకు తక్కువ కాకుండా హెచ్‌సీఎల్ కంపెనీ చెల్లించనుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఇంటర్‌తోనే ఉద్యోగం దక్కించుకునేలా ప్రభుత్వం విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తోంది. చదువుల్లో రాణించే విద్యార్థులకు ఇదో చక్కటి అవకాశం. దీనిని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలి. ఎక్కువ మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా కాలేజీల ప్రిన్సిపాళ్లు బాధ్యత తీసుకోవాలి. దీనిపై కాలేజీల స్థాయిలో అవగాహన సదస్సులను కూడా నిర్వహిస్తున్నాం.

– రాయల సత్యనారాయణ, ఆర్‌ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

పాడేరులో హెచ్‌డీఎఫ్‌సీ సేవలు





హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు శాఖ, ఏటీఎంను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

సాక్షి,పాడేరు: జిల్లాకేంద్రమైన పాడేరులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సేవలు అందుబాటులోకి వచ్చాయి. పాతపాడేరు జంక్షన్ వద్ద హెచ్‌డీఎఫ్‌సీ పాడేరు శాఖ బ్యాంకును సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్, ఏటీఎం విభాగాన్ని ఎస్పీ తుహిన్‌సిన్హా ప్రారంభించారు. జిల్లాలోని అన్నివర్గాల ప్రజలకు హెచ్‌డీఎఫ్‌సీ ద్వారా నాణ్యమైన సేవలు అందించాలని, భవిష్యత్తులో మరిన్నిప్రాంతాల్లో బ్యాంకు సేవలు విస్తరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. క్యాష్ కౌంటర్‌ను సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి ప్రారంభించారు. హెచ్‌డీఎఫ్‌సీ సర్కిల్ అధికారి శ్రీపాద విశ్వనాథ్, క్లస్టర్ అధికారి డి.గోపాలకృష్ణ, పాడేరు శాఖ బ్రాంచి మేనేజర్ కె.జి.ఎస్.శాస్త్రి, వర్తక సంఘం నేత కె.ప్రశాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరుగురు జూదరుల అరెస్టు

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము గ్రామ శివార్లలో జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ వెంకయ్య సోమవారం రాత్రి విలేకరులకు తెలిపారు. వీరిలో ఐదుగురు దూసరపాము గ్రామానికి చెందిన వారు కాగా ఒకరు వట్టిగెడ్డ గ్రామానికి చెందిన వారిగా పేర్కొన్నారు. పట్టుబడిన వారి నుంచి రూ. 1450 స్వాధీనం చేసుకొన్నట్టు తెలిపారు. జూదం, పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

పింఛన్ సొమ్ము పంపిణీ

అనంతగిరి: మండలంలో టోకూరు పంచాయతీ పింఛన్‌దారులకు అందజేసేందుకు సెర్ప్ నుంచి మరలా రూ. 7,01,750 జమచేశారు. ఈ పింఛన్ సొమ్మును సోమవారం ఎంపీడీవో శ్రీహర్షిత్ టోకూరు వెల్ఫేర్ అసిస్టెంట్ త్రినాథ్‌కు అందజేసి, పింఛన్ లబ్ధిదారులకు సొమ్మును వెనువెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు. పింఛన్ సొమ్మును అందజేసే విధంగా ప్రత్యేక చొరవ చూపిన కలెక్టర్ సుమీత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీకు ఎంపీడీవో శ్రీహర్షిత్ కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

చింతపల్లిరూరల్: చెట్టుమీద నుంచి పడి తీవ్రంగా గాయపడిన గూడెంకొత్తవీధి మండలం రంపుల గ్రామానికి చెందిన పాంగి సందీప్(10) అనే బాలుడు కేజీహెచ్‌లో చిక్సిత పొందుతూ మృతిచెందాడు. ఈ నెల 1న చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి తీవ్రగాయాలపాలైన సందీప్‌కు చింతపల్లి ఆస్పత్రిలో వైద్యాధికారి రుక్మిణి ప్రథమ చికిత్స చేసి, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

సరిహద్దు ప్రాంతాల్లో నిత్యం అప్రమత్తం



ముంచంగిపుట్టులో సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమేష్



ముంచంగిపుట్టులో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఈబీ సీఐ సంతోష్

ముంచంగిపుట్టు: పీఎల్‌జీఏ వారోత్సవాలతో ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు పరిస్థితులపై నిత్యం అప్రమత్తంగా ఉండాలని జి.మాడుగుల సీఐ రమేష్ సిబ్బందికి సూచించారు.మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేయాలని ఎస్‌ఐ రవీంద్రకు సూచించారు. దిశ యాప్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలని మహిళా పోలీసులకు చెప్పారు. గంజాయి రవాణా, సాగు వల్ల కలిగే అనర్థాలను గిరిజనులకు వివరించాలని సూచించారు.

వీఆర్ పురం: వీఆర్ పురం, కూనవరం పోలీసు స్టేషన్‌లను సీఐ దానేటి రామారావు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయనను వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కన్వీనర్ సత్తిబాబు, నాయకుడు సత్యనారాయణ, చిక్కాల బాలు, రామారావు, ఉమ, రాజు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చింతపల్లిరూరల్: మండలంలోని ఏపీఆర్ జూనియర్ కళాశాలను సీఐ రమేష్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నత చదువులు అభ్యసించి ఉత్తమ పౌరులుగా నిలవాలని ఆకాంక్షించారు. ఎస్‌ఐ అరుణ్‌కిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను పాడేరు ఎస్‌ఈబీ సీఐ ఎ.సంతోష్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గంజాయి తదితర మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, అమ్మకాలు చేపడితే కఠిన శిక్ష తప్పదన్నారు. గంజాయి వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. గంజాయి సాగు, రవాణాపై ఫిర్యాదులకు 14500 నంబర్‌కు కాల్ చేయాలని గంజాయి లేని గ్రామాలను నిర్మించడం కోసం విద్యార్థులు సహకరించాలని ఆయన కోరారు. ఎస్‌ఐ రవీంద్ర,ఎస్‌ఈబీ పోలీసులు పాల్గొన్నారు.



వీఆర్ పురంలో సీఐ రామారావును సన్మానిస్తున్న సిబ్బంది, గ్రామస్తులు



చింతపల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్

లెజెండ్స్ క్రికెట్ లీగ్ చివరి మ్యాచ్ రద్దు

విశాఖ స్పోర్ట్స్: మిచాంగ్ తుపాను కారణంగా విశాఖలోని సోమవారం జరగాల్సిన మ్యాచ్ రద్దయింది. చివరి మ్యాచ్‌లో మణిపాల్ టైగర్స్‌తో అర్బన్ రైజర్స్ హైదరాబాద్ తలపడాల్సి ఉంది. ఇరు జట్ల కెప్టెన్లతో పాటు అంపైర్లు పిచ్ పరిశీలించిన అనంతరం రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇరుజట్లు ఒక్కో పాయింట్‌ను ఖాతాలో జమచేసుకున్నాయి. గుజరాత్ జెయింట్స్ చివరి లీగ్ మ్యాచ్ ఆడి మూడు విజయాలు, ఒక పరాజయంతో ఏడు పాయింట్లు సాధించింది . చివరి మ్యాచ్ రద్దుతో టైగర్స్, అర్బన్ రైజర్స్ జట్లు సైతం ఏడేసి పాయింట్లతో నిలిచి సమవుజ్జీగా నిలిచాయి.నెట్ రన్‌రేట్ 1.224తో టైగర్స్ ఆధిక్యాన్ని ప్రదర్శించగా...అర్బన్ రైజర్స్ .514తో ద్వితీయ స్థానంలోనూ, జెయింట్స్ .083తో తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఇక మూడేసి పాయింట్లే సాధించి సూపర్‌స్టార్స్, కింగ్స్ కంటే కాస్త మెరుగైన రన్‌రేట్‌తో ఇండియా క్యాపిటల్స్ నాకవుట్‌కు అర్హత సాధించింది. టైగర్స్ జట్టును హార్భజన్ సింగ్, అర్బన్ రైజర్స్‌ను సురేష్‌రైనా, జెయింట్స్‌ను పార్థీవ్, క్యాపిటల్స్ జట్టును గౌతమ్ గంభీర్ ముందుకు నడిపించి నాకవుట్‌కు చేర్చారు.

కాలిన గాయాల నుంచి కోలుకున్న గిరిజన బాలిక



అమృతధారతో ఆస్పత్రి ఇన్‌చార్జ్ లక్ష్మి

రంపచోడవరం: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో ఉంటూ ఐదో తరగతి చదువుతున్న అమృతధార వర్షిణి అనే విద్యార్థిని కాలిన గాయాల నుంచి పూర్తి కోలుకుంది. గత నెల 9వ తేదీన మధ్యాహ్నం భోజనం కోసం లైన్‌లో ఉండగా అదుపు తప్పి సాంబారు గిన్నెలో పడిపోవడంతో గాయాలపాలైయింది. దీంతో రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. వైద్య సేవలు అనంతరం కోలుకోవడంతో సోమవారం డిశ్చార్జ్ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.లక్ష్మి పర్యవేక్షణలో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందిచడంలో పూర్తిగా కోలుకుంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించి. పూర్తిగా కోలుకున్న తరువాత డిశ్చార్జ్ చేసినట్టు తెలిపారు.

పరారైన ఇద్దరు గంజాయి నిందితుల అరెస్టు

ముంచంగిపుట్టు: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడి గతంలో పరారైన ఇద్దరు నిందితులను ముంచంగిపుట్టు పోలీసులు పట్టుకున్నారు. స్థానిక జి.మాడుగుల సీఐ రమేష్ అందించిన వివరాలు.. సోమవారం ఉదయం కించాయిపుట్టు పంచాయతీ పెద్దపుట్టు గ్రామ సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా కుమడ నుంచి మండల కేంద్రానికి కాలినడక వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని పట్టుకొని విచారించిన పోలీసులు.. నవంబర్ నెలలో కుమడ పంచాయతీ కేంద్రంలో 150 కిలోల గంజాయి రవాణా కేసులో పట్టుబడి తప్పించుకున్న కొత్తగి సిద్దేశ్వరరావు, కిల్లో పరమేశ్వరరావులుగా గుర్తించారు. అప్పట్లో గంజాయి అక్రమ రవాణాలో ఇద్దరు దొరికారు..

ఐదుగురు పరారయ్యారు. పరారైన వారిలో ఇద్దరిని ఇప్పుడు పట్టుకున్నామని, అరెస్టు చేసి సోమవారం కోర్టుకు తరలించామని సీఐ రమేష్ తెలిపారు. ఈ తనిఖీలలో ఎస్‌ఐ రవీంద్ర, ముంచంగిపుట్టు పోలీసులు పాల్గొన్నారు.

గిరిజనుల విద్యాభివృద్ధికి మరింత కృషి

ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

గంగవరం: గిరిజనుల విద్యాభివృద్ధికి మరింత కృషి చేయాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని ఆయన సుడిగాలి పర్యటన చేసి, పలు పాఠశాలలను సందర్శించారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు మోహనాపురం, టేకులవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలురు, బాలికల ఆశ్రమపాఠశాలల్లో విద్యార్థులను అందుతున్న సౌకర్యాలను, ఉపాధ్యాయులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం కొత్తాడ కేజీబీవీ పాఠశాలలో ఫిజిక్స్ పాఠాన్ని బోధించారు. ఈ సందర్భంగా గంగవరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అక్షరాస్యత శాతం పెంపునకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం అమలును స్వాగతిస్తున్నట్టు చెప్పారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడేషన్ కోసం కృషి చేస్తానన్నారు. ఆయన వెంట యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కె.కృష్ణ, గంగవరం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్ రాంబాబు దొర, సీహెచ్ వెంకటేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు రుక్మిణీదేవి, సహ అధ్యక్షులు కె.బుజ్జి దొర, యూటీఎఫ్ జిల్లా నాయకులు సీహెచ్ రామకృష్ణారెడ్డి, ఎం.వెంకన్న దొర, సత్యకిరణ్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు యూన్సీహేన్సన్, నాగేశ్వరరావు, సత్యనారాయణ, బాలరాజు, చిన్నారెడ్డి తదితరులున్నారు.



ఎంపీపీ పాఠశాలలో పిల్లలతో కలసి భోజనం చేస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

- భక్తిశ్రద్ధలతో పూజలు

సాక్షి,పాడేరు: పవిత్ర కార్తీక మాసం మూడవ సోమవారం పురస్కరించుకొని జిల్లాలోని అన్ని శివాలయాల్లోను భక్తులు ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లోని ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. పాడేరు పట్టణంలో అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం అంబలం పూజను భక్తితో అయ్యప్పమాలధారులు నిర్వహించారు.



అంబలం పూజ చేస్తున్న అయ్యప్ప మాలధారులు



దీపారాధన నిర్వహిస్తున్న భక్తులు

17న రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు

గాజువాక : రాష్ట్ర న్యూ కిక్ బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న గాజువాకలో 13వ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలను నిర్వహించనున్నట్టు ఆ సంఘం గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు తెలిపారు. పోటీల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. స్థానిక అమరావతి పార్కు మైదానంలో ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను వచ్చేనెలలో ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, ప్రతినిధులు ప్రేమ్ కుమార్, కరణం సన్ని, కోచ్‌లు వెంకట్, ఆనంద్, రేవంత్, ఆదిత్య, రంజిత్ పాల్గొన్నారు.

తుపాను అప్రమత్తతపై సూచనలు



గిరిజన రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు



రైతులకు సూచనలిస్తున్న తహసీల్దార్ శ్రీధర్, ఏఓ రఘు



జీకే వీధిలో రైతులకు సూచనలు ఇస్తున్న మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు

గూడెంకొత్తవీధి/జి.మాడుగుల/పెదబయలు/చింతపల్లి రూరల్/కొయ్యూరు/అడ్డతీగల/వై.రామవరం/ఎటపాక/ చింతూరు/రాజవొమ్మంగి/వి.ఆర్.పురం : మిచాంగ్ తుపాను వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి కోతల పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. పంటను కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. మిచాంగ్ తుపానుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాప్తంగా అధికారులు రైతులకు పలు సూచనలిచ్చారు. వివిధ ప్రాంతాల్లో వ్యవసాయాధికారులు తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు సోమవారం పర్యటించారు. భారీ నుంచి అతిభారీ వర్షాల వల్ల పొలాలు, గెడ్డలు దాటే ప్రయత్నాలు చేయవద్దని, చెట్ల కింద ఉండవద్దని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు రావద్దని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. రోడ్లపై చెట్లు కూలి రాకపోకలకు ఆటంకం కలిగితే 9440904221, 9398126443 నంబర్లకు సమాచారం ఇవ్వాలని జి.మాడుగుల పోలీసు అధికారులు తెలిపారు.

వరి కోతలు వాయిదా వేయాలి

మిచాంగ్ తుపాను ప్రభావంతో ఈదురుగాలులు, భారీ వర్షాలు కురుస్తాయని రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. కుప్పలు వర్షానికి తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు తగ్గిన తరువాత తడిసిన పనలపై మందులు పిచికారీ చేయాలన్నారు. కంబైన్డ్ హార్వెస్టర్ యంత్రాలను ఉపయోగించి మాత్రమే కోతలు కోసి వెంటనే ధాన్యాన్ని సురక్షితమైన ప్రాంతానికి తరలించి టార్పాలిన్లు కప్పాలన్నారు. కోసిన వరి పంటను ఎత్తైన ప్రదేశాలకు తరలించి కుప్పలుగా వేయాలని సూచించారు. ఎకరా కుప్పకు 40 కిలోల కల్లు ఉప్పు ఒదెల మధ్యలో వేసి టార్పాలిన్ పట్టాతో కప్పాలని సూచించారు. గింజలు మొలకెత్తకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని, 50 గ్రాములు ఉప్పును ఒక లీటరు నీటికి కలిపి తడిచిన కంకులపై లేదా ధాన్యంపై పిచికారీ చేయాలన్నారు.వరి, పత్తి, మిరప, మొక్కజొన్న తదితర పంటల్లో నీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏవోలు మధుసూదనరావు, ఉమాదేవి, సువర్ణకుమారి, రాబిన్‌సుదర్శన్, శ్రీధర్, శ్రీలక్ష్మి, ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దార్ సుబ్బారావు తదితరులు గ్రామాల్లో పర్యటించి రైతులు, ప్రజలకు సూచనలిచ్చారు.

పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం : పుణ్యక్షేత్రాలను, పలు ఆలయాలను సందర్శించాలనుకునే యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైలు ప్యాకేజీలను ప్రకటించింది. ఈ సీజన్‌లో ఇప్పటికే తొమ్మిది యాత్రలను పూర్తిచేసి, పదో యాత్ర కోసం ఐఆర్‌సీటీసీ సిద్ధమైంది. ఈ టూర్‌లో కుటుంబ సమేతంగా, అలాగే సీనియర్ సిటిజన్స్‌కు చక్కని అవకాశం అందుబాటులోకి రానుంది. మొదటిసారిగా అయోధ్య వంటి ప్రాంతాలను కూడా ఈ టూర్‌లో సందర్శించే అవకాశం కల్పిస్తున్నారు. ఈ మేరకు ఐఆర్‌సీటీసీ, సౌత్ సెంట్రల్ జోన్ ఏరియా ఆఫీసర్ చంద్ర మోహన్ బిసా సోమవారం టూర్ వివరాలు తెలిపారు. కేవలం ఈ యాత్ర కోసం ఐఆర్‌సీటీసీ 7 స్లీపర్, 3-థర్డ్ ఏసీ, 1-సెకండ్ ఏసీ కోచ్‌లతో ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు ఆయన తెలిపారు.

భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ (పుణ్య క్షేత్ర యాత్ర) యాత్ర మొత్తం 8 రాత్రులు, 9 పగళ్లు ఉంటుంది. ఈ యాత్రకు సంబంధించిన ప్రత్యేక రైలు సికింద్రాబాద్‌లో డిసెంబరు 9వ తేదీన బయల్దేరుతుంది. ఈ యాత్రలో ప్రయాణించాలనుకునేవారు పెందుర్తి, విజయనగరంలలో మాత్రమే ఈ రైలు ఎక్కాల్సి ఉంటుంది. అదే స్టేషన్‌లలో తిరిగి దిగుతారు. ఈ యాత్రలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన పూరి, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లలో గల జగన్నాథ్‌టెంపుల్, విష్ణుపాదం టెంపుల్, కాశీ విశ్వనాథటెంపుల్, విశాలాక్షి టెంపుల్, అన్నపూర్ణదేవి టెంపుల్, గంగా ఆరతి, రామ్ జన్మ భూమి, హనుమాన్ గర్హి టెంపుల్, త్రివేణి సంగమం, హనుమాన్ మందిర్, శంకర్ విమాన్ మండపం వంటి ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చు. ఒకొక్కరికి టికెట్, వసతి, స్థానిక రవాణా చార్జీలతో కలిపి ఎకానమి రూ.15,200, పిల్లలకు (5–11 ఏళ్ల లోపు) రూ.14,200, స్టాండర్డ్ రూ.24,000, పిల్లలకు(5–11 ఏళ్ల లోపు) రూ.22,900 , కంఫర్ట్ రూ.31,500, పిల్లలకు (5–11 ఏళ్ల లోపు) రూ.30,100 (అన్ని పన్నులు, జీఎస్టీతో కలిపి)గా ఐఆర్‌సీటీసీ నిర్ణయించింది. ఎకానమి ప్రయాణికులకు నాన్ ఏసీ బడ్జెట్ హోటల్, నాన్ ఏసీ వాహనాలలో తీసుకువెళ్తారు, స్టాండర్డ్ / కంఫర్ట్ ప్రయాణికులకు థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ రూంలలో వసతి కల్పిస్తారు, నాన్ ఏసీ/ఏసీ వాహనాల్లో తీసుకువెళ్తారు.

సదుపాయాలు ఇవే..

- ఉదయం టీ, అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం(వెజిటేరియన్)
- అన్ని పార్కింగ్ చార్జీలు, టోల్ చార్జీలు, జీఎస్టీలతో కలిపి ఈ యాత్రల గురించిన మరిన్ని వివరాలకు విశాఖపట్నం రైల్వేస్టేషన్ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద గల ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా గానీ, చందన్‌కుమార్ – 82879 32318, సాయిప్రసాద్ – 92814 95847, ఎస్ విశాలాక్షి–97010 85461 నంబర్లలో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్ బిసా తెలిపారు.

నృసింహ దీక్షలు ప్రారంభం



దీక్ష తీసుకునేందుకు వచ్చిన భక్తులు

- 450 మంది మాలధారణ
- జనవరి 6న దీక్ష విరమణ

సింహాచలం: శ్రీ నృసింహ దీక్షలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 32 రోజులపాటు దీక్ష సాగనుంది. దీక్ష స్వీకరించడానికి వచ్చిన సుమారు 450 మందికి సింహగిరిపై మాలధారణ చేసే కార్యక్రమాన్ని దేవస్థానం వైదిక, అధికార వర్గాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సింహగిరిపై ఉన్న ప్రిలిగ్రిమ్స్ భవనంలో ప్రత్యేకంగా వేదిక ఏర్పాటుచేసి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ప్రతిమలను ఉంచారు. దీక్ష తీసుకునేందుకు వచ్చిన వారిని ఆశీనింపజేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాస మూర్తి, అర్చకులు మేళతాళాలు, వేద మంత్రోచ్చరణల మధ్య ఆలయంలోంచి తులసి మాలలను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. స్వామిచెంతన తులసిమాలలను ఉంచి అర్చకులు విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామివారి అష్టోత్తర శతనామావళిని దీక్షాధారులందరిచేత పఠింపజేశారు. అనంతరం దీక్షాధారులకు మాలధారణ చేశారు. దేవస్థానం తరఫున దీక్షా వస్త్రాలను, క్షేత్ర పురాణం కరపత్రాలను ఈవో అందజేశారు. ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు సాతులూరి నరసింహాచార్యులు, వేద పండితులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. దీక్ష తీసుకున్నవారిలో సింహాచలంలోని చందన పెరుమాళ్ల పీఠం, సింహాద్రి మఠానికి చెందిన సభ్యులు, విశాఖ ఏజెన్సీ ప్రాంత గిరిజనులు, ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశాలోని పలు ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు ఉన్నారు. చందన పెరుమాళ్ పీఠం గురుస్వామి సానబోయిన రాజు, సింహాద్రి మఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్ర స్వామి కార్యక్రమంలో పాల్గొన్నారు. 32 రోజులు దీక్షలు తీసుకున్నవారితో పాటు, 41రోజులు దీక్ష తీసుకున్న వారంతా రానున్న జనవరి 6వ తేదీన దీక్ష విరమించాల్సి ఉంటుందని, ఆరోజు దీక్షావిరమణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని ఈవో శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు.